క్లుప్తంగా

ఎడ్ల బండి గిరక పోటీలు ప్రారంభం



మరికల్: మండలంలోని ఎలిగండ్లలో ఉగాది పండగా సందర్భంగా రైతుసంఘం ఆధ్వర్యం లో బుధవారం ఎడ్లబండి గిరక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో కాడేడ్ల బండి చక్రాల మధ్యన కర్రను పెట్టి నిర్ణీత సమయంలో లక్ష్యం చేరిన ఎడ్లబండి రైతులను విజేతగా ప్రకటించారు. ఈ పోటీలో మొదటి విజేతగా బడే సాబ్, రెండో బహుమతి అమీర్‌పాషా గెలుపొందారు. వీరికి బీజేవైఎం అధ్యక్షుడు నరేష్‌గౌడ్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో నరేష్‌గౌడ్, ఎల్లాగౌడ్, హన్మంతు, ఉస్సేన్, రైతులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



ఊట్కూరు: మండలంలోని ప్రభుత్వ ఆస్పత్రిని బుధవారం జిల్లా అధికారిణి డా. శైలజ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వ్యాధినిరోధక టీకాల కార్యక్రమం ఎలా సాగుతుందని వ్యాక్సిన్ సరిపడా నిల్వ ఉన్నదా అని వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డా భవాని, డా శ్రీలత, వైద్యసిబ్బంది విజయ్‌కుమార్, నాగమ్మ, రాజశ్రీ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం కాపాడాలని వినతి

కోస్గి: పట్టణంలోని 9వ వార్డులో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కొందరు వ్యక్తులు ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నారని, ఈ విషయంలో సర్వే నిర్వహించి ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ బుధవారం కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇళ్ల మధ్యలో ఉన్న ఈ స్థలంలో కాలనీవాసులకు ఉపయోగపడేలా సామూహిక మరుగుదొడ్లు గాని, ఇతర ప్రజలకు ఉపయోగపడే నిర్మాణాలు చేపట్టాలని కోరారు. ఇప్పటికే ఈ స్థలాన్ని చదును చేసి కబ్జా చేసే ప్రయత్నాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయని, ప్రశ్నించిన కాలనీవాసులపై దాడులు చేసేందుకు వస్తున్నారని, ఈ విషయంలో తగిన చర్యలు తీసుకొని ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు. ఇందులో పలువురు కాలనీవాసులు, యువకులు ఉన్నారు.

పల్లెర్ల హరికథా కాలక్షేపం



మద్దూరు: ఉగాది పండుగను పురస్కరించుకొని పల్లెర్ల గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో గ్రామస్తుల ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి తిరుమల తిరుపతి దేవాస్థానం అస్థాన భాగవతారిణి జయంతి సావిత్రి 'గజేంద్ర మోక్షం' హరితకాలక్షేపం చేశారు. అంతకుముందు ఆలయ ఆవరణలో పంచాగా శ్రావణం నిర్వహించారు. గజేంద్ర మోక్షంలో వివిధ ఘట్టాలను వివరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ కేంద్రం ప్రారంభం

నారాయణపేట రూరల్ : పట్టణంలోని చౌక్ సెంటర్‌లో ఇటీవల ఏర్పాటుచేసిన చలివేంద్రంలో బుధవారం మజ్జిగ పంపిణీ ప్రారంభించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1981–83 బ్యాచ్‌లో ఇంటర్ చదివిన పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో గత కొద్ది సంవత్సరాలుగా వేసవిలో చలివేంద్రం నిర్వహిస్తున్నారు. అయితే ప్రతీ బుధవారం సంత రోజు కావడంతో జనాలు ఎక్కువగా వస్తుండటంతో వారి సౌకర్యార్థం మజ్జిగను అందించాలని ఆర్టీసీ డీఎం లక్ష్మీసుధా చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కమల, నర్సింహులు, డాక్టర్ క్యాతన్ రఘునాథ్, వినయన్‌రెడ్డి, జగదీష్, సత్యనారాయణగౌడ్, రేణుక, బస్వరాజ్ పాల్గొన్నారు.

కల్యాణోత్సవం ఏర్పాట్ల పరిశీలన

మక్తల్: శ్రీ రామనవమి సందర్భంగా బుధవారం పట్టణంలో రాంలీలా మైదానంలో సీతారాముల కల్యాణోత్సవం ఏర్పాట్లను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పరిశీలించారు. భక్తులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లుచేయాలని నిర్వాహకులకు తెలియజేశారు. వెంట పూజరి ప్రాణేష్‌కుమార్, కట్టసురేష్, రవికుమార్, కావలి తాయప్ప తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్ లేక అవస్థలు

- రోగులకు తప్పని తిప్పలు
- అందుబాటులో లేని 108
- అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు కోల్పోతున్న వైనం
- చొరవ చూపని అధికారులు, నాయకులు



మాగనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

మాగనూర్: మండల కేంద్రంలో అంబులెన్స్ లేక అయా గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. అత్యవసర వైద్యంకోసం ఎదురుచూస్తున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించేందుకు, గ్రామస్తులు అనారోగ్యానికి గురైనప్పుడు, గర్భిణులకు అత్యవసర సేవలు అందించేందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 108వాహనాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. మహానేత ఆశయానికి అడుగుణంగా సేవలు సత్ఫలితాలు ఇవ్వడంతోపాటు ఎంతో మంది ప్రజలకు మేలు చేకూరింది. కానీ ప్రస్తుతం ఉమ్మడి మాగనూర్, కృష్ణా మండల ప్రజాప్రతినిధులు, అధికారులకు ప్రత్యేక చొరవ లేకపోవడంతో 108 వాహనకోసం ఎదురుచూపులు తప్పడం లేదు.

29 గ్రామ పంచాయతీలు..

ఉమ్మడి కృష్ణా, మాగనూర్ మండలాలలోని 29గ్రామ పంచాయతీలో 34గ్రామాలు ఉన్నాయి. ప్రస్తుతం సుమారు 50 వేలకు పైబడి జనాభా ఉంది. ఇదిలా ఉండగా.. వైద్యసేవల కోసం మండల కేంద్రంతోపాటు మక్తల్‌లో ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. కానీ అబులెన్స్ సౌకర్యం కల్పించలేదు. స్థానిక ఆరోగ్య కేంద్రం నుంచి 5నుంచి 25 కిలోమీటర్ల దూరంలో ఉంటాయి. ఎవరికైనా అనారోగ్య సమస్య తలెత్తినా దిక్కుతోచని స్థితిలో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించక తప్పడం లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రత్యేక చొరవ తీసుకుని అంబులెన్స్ కేటాయించాలని మండల వాసులు కోరుతున్నారు.

మక్తల్, నారాయణపేట నుంచి..

ఉమ్మడి మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి ప్రత్యేక అంబులెన్స్ లేదు. దీంతో కొన్న సందర్భాల్లో 108కాల్ చేస్తే, ఎప్పుడో ఒకసారి 10కిలో మీటర్ల దూరంలోని మక్తల్ లేదా నారాయణపేట నుంచి వస్తుంది. ఈ వాహనం సైతం చాలా సార్లు అందుబాటులో లేకపోవడంతో బాధితులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వాహనం కేటాయించాలి..



మండలానికి ప్రత్యేకంగా 108వాహనం కేటాయించాలి. అత్యవసర పరిస్థితులలో వైద్యసేవల కోసం ఆలస్యమవుతోంది. దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. 108 మండలానికి కేటాయిస్తే బాధితులను సకాలంలో ఆస్పత్రులకు తీసుకెళ్లవచ్చు. ఇకనైనా మండల ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలి.

– నర్సింహులు, మాజీ సర్పంచ్ వడ్వాట్ గ్రామం

ఇబ్బందులు పడుతున్నాం..



మండల కేంద్రంలో అంబులెన్స్ లేక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. 108కు కాల్‌చేస్తే, మక్తల్ నుంచి రావాల్సి వస్తోంది. ఏదైనా ప్రమాదం జరిగినా.. రోగాల బారిన పడినా.. పీహెచ్‌సీ నుంచి జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నారు. దీంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారు.

– నాగరాజు, యువకుడు మాగనూర్

అంబులెన్స్ అందుబాటులో ఉంటే బాగుంటుంది..



ప్రస్తుతం ఉమ్మడి మాగనూర్, కృష్ణా మండలాలకు ఒకే ఒక్క ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. అయితే కొన్ని అత్యవసర సమయంలో బాధితులను ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేస్తారు. మక్తల్, నారాయణపేట నుంచి అంబులెన్స్ వచ్చే సరికి కొన్ని సందర్భాల్లో ఆలస్యమవుతుంది. ఇక్కడే ఒక అంబులెన్స్ అందుబాటులో ఉంటే ప్రజలకు ఎంతో సాయపడుతుంది.

– విరోజ, మండల వైద్యాధికారిణి, మాగనూర్

భూ బాధితులకు న్యాయం చేయాలి



ఏఓకు వినతిపత్రాన్ని అందజేస్తున్న భూ బాధితులు

నారాయణపేట: మండల పరిధిలోని అప్పక్‌పల్లి శివారులో నిర్మిస్తున్నా ప్రభుత్వ జిల్లా వైద్యకళాశాల, ఆస్పత్రికి భూములు ఇచ్చిన చట్టం ప్రకారం న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రాం డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ ఏఓ నర్సింగరావుకు భూ బాధితులతో కలిసి ఆయన వినతిపత్రం అందజేసి మాట్లాడారు. మెడికల్ కళాశాల, జిల్లా ఆస్పత్రి నిర్మాణంకోసం 32 ఎకరాల వ్యవసాయ భూమిని మూడు సంవత్సరాల కిందట జాజాపూర్‌కు చెందిన 15మంది రైతులు అందజేశారన్నారు. నేటికీ బాధితులకు పరిహారం ఇవ్వలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ విలువైన భూములను ప్రభుత్వానికి అందజేసిన రైతులకు న్యాయం చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో రైతులు దామోదర్‌గౌడ్, బాలకిష్టయ్యగౌడ్, అనిల్ గౌడ్, అమ్మనోళ్ల కనకప్ప, భారతమ్మ, ఖర్మతుల్లా, అల్లం పాషా, చాకలి వెంకటప్ప, సాయిలు పాల్గొన్నారు.

బైరంపల్లి మారమ్మవ్వ జాతరకు ఆహ్వానం



ఆహ్వాన పత్రికను అందజేస్తున్న గ్రామస్తులు

మాగనూర్: మండల పరిధిలోని బైరంపల్లి మారెమ్మవ్వ జాతర ఈ నెల 16న సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని బుధవారం కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం ఏప్రిల్ నెలలో జాతర మహోత్సవం వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని జాతర మహోత్సవంలో పాల్గొనాలని ఆహ్వానించామని తెలిపారు. ఈ జాతర మహోత్సవానికి కర్ణాటక, మహారాష్ట్ర, హైదరాబాద్ లాంటి ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, బైరంపల్లి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ పోస్టులను భర్తీచేయండి




వినతిపత్రం అందిస్తున్న బార్ అసోసియేషన్ నాయకులు

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలోని కోర్టులో ఉన్న ఖాళీపోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరుతూ బార్‌అసోసియేషన్ ఆధ్వర్యంలో హైకోర్టులో జిల్లా పోర్ట్ పోలియో జడ్జీ జువ్వాడ శ్రీదేవిని బుధవారం కలిసి విన్నవించారు. గత నెలలో హైకోర్టు జడ్జీ విజయభాస్కర్‌రెడ్డిని కలిసిన వీరంతా ఈమెకు వినతిపత్రం అందించారు. అంతకు ముందు ఆమెను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి బొకె అందించారు. కోర్టుకు సంబంధించిన అన్ని వివరాలు తెలియజేశారు. కార్యక్రమంలో దామోదర్‌రెడ్డి, నందునామాజీ, చెన్నారెడ్డి, వినోద్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

దామరగిద్ద: మండల కేంద్రంలో షిరిడీసాయి ఆలయ నిర్మాణానికి బుధవారం వేద పండితులు వేదమంత్రాలతో హోమం, భూమిపూజ నిర్వహించారు. సాయిబాబ భక్తుడు దామరగిద్దకు చెందిన వన్నాడ బొంబాయి వెంకటప్ప తనసొంత వ్యవసాయ క్షేత్రంతో ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. షిరిడీ సాయి భక్తుల సౌకర్యార్థం పూజించుకునేందుకు వీలుగా ఆలయ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆశమ్మఅంజయ్య, స్థానిక సాయిబాబ భక్తులు మొగులప్ప, గలజప్ప, పోలీస్ వెంకటప్ప, నీలి వెంకట్రాములు, వన్నాడ సత్యనారాయణ, శ్రీనివాస్, భీంషప్ప, భీంరెడ్డి, నర్సింహులు, వెంకటప్ప, బాబు, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత



అక్రమ నిర్మాణం కూల్చివేయడంతో ఖాళీగా కన్పిస్తున్న ప్రభుత్వ స్థలం

మరికల్: కోట్ల రూపాయలు విలువ చేసే ప్రభుత్వ స్థలం సర్వే నంబర్ 1లో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలను ఎట్టాకెలకు కలెక్టర్ ఆదేశాలమేరకు బుధవారం అధికారులు కూల్చివేయించారు. ఎన్నో ఏళ్ల నుంచి కాపాడుకుంటూ వస్తున్న ఈ స్థలంలో కొందరు వ్యక్తులు ఈ స్థలం తమదంటూ హైకోర్టు ద్వారా స్టే తెచ్చుకొని నిర్మాణాలను చేపట్టారు. ఈ విషయంపై అఖిలపక్షం నాయకులు గత నెలరోజుల నుంచి తహసీల్దార్‌కు వినతిపత్రాలను ఇస్తు ధర్నాలు నిర్వహించారు. అయిన అక్రమ నిర్మాణాలు ఆగకపోవడంతో చివరకు కలెక్టర్‌ను సంప్రదించారు. కలెక్టర్ ఆదేశాలతో ఈ నెల 8న అక్రమ నిర్మాణాలను కూల్చివేసేందుకు రెవెన్యూ శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శి సిబ్బందితో అక్కడికి వచ్చారు. హైకోర్టు స్టే ఉందని ఎలా కూల్చివేస్తారని నిర్మాణదారులు అధికారులతో వాగ్వివాదానికి దిగారు. దీంతో చేసేంది లేక అధికారులు ఈ విషయాన్ని మరోసారి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి అక్కడి అధికారులు వెనుదిరిగారు. ఈ విషయంపై ఆగ్రహంగా ఉన్న కలెక్టర్ ప్రత్యేక పోలీస్ బలగాలను అక్కడికు పంపించి బందోబస్తు మధ్యన అక్రమనిర్మాణాలను కూల్చివేయించారు. నెలరోజుల తర్వాత ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు కూల్చివేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముస్లింలకు ఇఫ్తార్



మద్దూరు: రంజాన్ మాసంలో చివరి ఉపవాస దీక్ష సందర్భంగా మండలంలోని ఆయా మజీద్ కమిటీల ఆధ్వర్యంలో ఉపావాస దీక్ష చేపట్టినా ముస్లింలకు ఇఫ్తార్ ఇచ్చారు. ఈ మేరకు.. ముస్లిం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండలంలోని మద్దూరు, నిడ్జింత, భూనీడ్, పల్లెర్ల, తదితర గ్రామాల్లో ఈ విందులు కొనసాగాయి.

మృతుడి అవయవాలు దానం



ధన్వాడ: మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన యువకుడు బాలకృష్ణ అవయవాలను కుటుంబసభ్యులు దానం చేశారు. మృతిడి కంటిని రమయ్యా ఇంటర్‌నేషనల్ ఐ బ్యాంక్‌కు డోనేట్ చేశారు. బుధవారం సంబంధిత అధికారులు మృతుడి తండ్రి చంద్రప్పకు సర్టిఫికెట్‌ను అందజేశారు.

జోరుగా వరికోతలు



మాగనూర్: మండల వ్యాప్తంగా వరికోతలు జోరుగా సాగుతున్నాయి. ఆరు నెలలు శ్రమించిన రైతు కష్టం పంట రూపంలో చేతికి అందుతోంది. మరో రెండు, మూడు వారాల్లో దాదాపుగా వరికోతలు పూర్తవుతాయని వ్యవసాయశాఖ అధికారులు భావిస్తున్నారు. మరోవైపు ఈ యాసంగిలో వర్షాభావ దృష్ట్యా బోరుబావులు, చెరువులు, కాల్వలు ఎండిపోవడంతో ఇప్పటికే వందలాది ఏకరాల్లో వరి పంటలు ఎండిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పంటనష్టం సర్వే చేయించి రైతులను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

అమరచింత: బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అక్కల నరసింహులుగౌడ్ మాతృమూర్తి వెంకటేశ్వరమ్మ మంగళవారం ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాజేందర్ సింగ్, బాలరాజు, కమలాకర్‌గౌడ్, నాగభూషణంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



తాగునీటిని వృథా చేయొద్దు..



మహిళలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ జయరాములు

మద్దూరు: వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని తాగునీటిని వృథా చేయొద్దని ఎంపీడీఓ ప్రజలకు సూచించారు. బుధవారం మండలంలోని లాల్యానాయక్ తాండా, లింగ్యానాయక్‌తాండా, దామ్లతాండాలో తాగనీటి సరఫరాపై అక్కడి వెళ్లి పరిశీలించారు. ఈ గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా ఎంత నీటిని అందిస్తున్నారని మిషన్‌భగీరథ ఏఈ నరేష్‌ను అడిగి తెలుసుకున్నారు. మీ తాండాలకు అవసరమైన నీటిని అందిస్తున్నాం. నీటిని వృథా చేయడంతో మీకే నష్టం వస్తుందని తెలిపారు. ప్రతి రోజూ ఎంత నీరు వస్తుంది. ఎంత సరఫరా జరుగుతుందని పంచాయతీ కార్యదర్శులు తెలుపాలని ఆదేశించారు.

కేంద్ర పథకాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న కెంచె శ్రీనివాసులు

నారాయణపేట రూరల్: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రచారం చేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని బీజేపీ, ఓబీసీ మోర్చ నాయకులు కెంచె శ్రీనివాసులు అన్నారు. మండలంలోని కోటకొండ గ్రామంలో నిర్వహించిన బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలతోపాటు ఆరు గ్యారంటీలు అంటు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మోసపూరిత హామీలపై ప్రజలకు తెలియజేయాలన్నారు. కేంద్రంలో మరోసారి ముచ్చటగా మోదీ ప్రభుత్వం రాబోతున్నదని, దేశ రక్షణతోపాటు సాహసోపేత నిర్ణయాలతో ప్రపంచానికే ఒక మార్గదర్శిగా నిలబెట్టబోతున్న పార్టీకి పాలమూరు ప్రజలు మద్దతు తెలిపి డీకే అరుణను గెలిపించే విధంగా కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో మోహన్, రవి, బాలరాజు, రాజు, నవీన్, రాములు, ప్రవీణ్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా అంబలి పంపిణీ



జాజాపూర్‌లో అంబలి పంపిణీ చేస్తున్న శాంతప్ప



మరికల్‌లో అంబలి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రశాంత్‌కుమార్‌రెడ్డి

నారాయణపేట రూరల్ : మండలంలోని జాజాపూర్‌లో ఉచితంగా అంబలి పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామానికి చెందిన కో – ఆపరేటివ్ బ్యాంక్ రిటైర్డ్ ఉద్యోగి శాంతప్ప ఏటా వేసవి కాలంలో బాటసారుల కోసం సొంత డబ్బులతో అంబలి పంపిణీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఈ ఎండాకాలానికి సంబంధించి బుధవారం ఆయన తన ఇంటి వద్ద అంబలి పంపిణీని ప్రారంభించారు. అదేవిధంగా కుండలు పెట్టి ఉచితంగా చల్లటి నీటిని అందించడానికి చలివేంద్రం నిర్వహిస్తున్నాడు. ఆయన చేస్తున్న కృషిని గ్రామస్తులు అభినందిస్తున్నారు.

మరికల్: మండలంలోని తీలేర్ స్టేజీ వద్ద ఉగాది పండగను పురస్కరించుకుని బుధవారం మాజీ సర్పంచ్ వెంకారెడ్డి, వజ్రమ్మ, మాజీ ఎమ్మెల్యే వీరారెడ్డి జ్ఞాపకర్థంగా అంబలి కేంద్రాన్ని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాటసారుల దాహం తీర్చేందుకు ప్రతి వేసవిలో అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రయాణికులు, కూలీలకు వేసవిలో అంబలి కేంద్రం ద్వారా దాహం తీర్చడం ఈ సేవలను మరువలేమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రేవత్తమ్మ, ఎంపీటీసీ సునీత, కృష్ణయ్య, వినితమ్మ, అంజిరెడ్డి, కుర్మయ్య, ఆంజనేయులు, విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అత్యంత పవిత్రమైన పండగ రంజాన్



ఇఫ్తార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, కుంభం శివకుమార్ రెడ్డి

దామరగిద్ద: ముస్లింలు అత్యంత క్రమశిక్షణ ఉపవాస దీక్షలతో జరుపుకునే పవిత్ర పండగ రంజాన్ అని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, కాంగ్రెస్ పేట ఇన్‌చార్జి కుంభం శివకుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని దామరగిద్ద జామ మసీద్ లో ముస్లింలు అందించిన ఇఫ్తార్‌లో భాగంగా ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ముస్లింలు నెలరోజులపాటు ఉపవాస దీక్షలతో పఠించి భక్తి శ్రద్ధలతో అల్లాను కొలుస్తారన్నారు. క్రమశిక్షణకు దైవభక్తికి ప్రతీకగా నిలిచిన రంజాన్ పండగ ముస్లింలందరికీ శుభాలు కల్గించాలని కోరారు. అనంతరం రంజాన్ శుభాకాంక్షలను తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, వింగ్ అధ్యక్షుడు ఈదప్ప, శ్రీనివాస్, కో–ఆప్షన్ సభ్యుడు రఫీ, ఖాజా, నభీ, మునీర్, చాంద్‌పాషా, బసీర్, రఘు, శరణ్‌నాయక్, వెంకట్రాములు, వెంకట్రామరెడ్డి, అంజప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రార్థనలకు ఈద్గా ముస్తాబు



పారిశుద్ధ్య పనులు చేస్తున్న మున్సిపల్ కార్మికులు

అమరచింత: గురువారం జరిగే రంజాన్ పండుగ నాడు ఈద్గాల వద్ద నిర్వహించే పవిత్ర ఈధుల్‌ఫిథర్ నమాజుకు పట్టణంలోని ఈద్గాలను ముస్తాబు చేశారు. మున్సిపల్ ఆధ్వర్యంలో ఈద్గా వద్ద పారిశుద్ధ్య పనులను చేపట్టారు. ముళ్లపొదలతో పాటు కంపచెట్లను తొలగించారు. ఈద్గాకు సున్నం వేయడంతోపాటు నమాజుకు హాజరవుతున్న ప్రజల కోసం షామియానాలను సిద్ధం చేశారు. తాగునీటి వసతితోపాటు ఈద్గా పరిసర ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ తెలిపారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



రాజీవ్ చౌరస్తాలో వాహనాల తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ సురేష్

అమరచింత: పట్టణంలోని రాజీవ్‌గాంధీ చౌరస్తాలో బుధవారం వాహనాల తనిఖీలను ముమ్మరంగా నిర్వహించి నాకబందితో అవగాహన కల్పించామని ఎస్‌ఐ సురేష్‌కుమార్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో భాగంగా తనిఖీలు చేస్తున్నామని, డ్రైవింగ్ లైసెన్స్‌లతో పాటు, వాహనాలకు సంబంధించిన ఆర్‌సీలను పరిశీలిస్తున్నామన్నారు. అక్రమంగా నగదును తరలిస్తే స్వాధీనం చేసుకోవడంతో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రూ.50 వేల నగదు కంటే ఎక్కువగా తరలిస్తే వీటికి సంబంధించిన ఆదారాలు ఉంచుకోవాలని సూచించారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలను ఇస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. అదే విధంగా తాగి వాహనాలను నడపొద్దని, డ్రంకెన్‌డ్రైవ్ కేసులు నమోదు చేస్తామన్నారు.

బాలాజీ నగర్‌లో సెల్‌టవర్ వద్దు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని బాలాజీ నగర్ కాలనీలో సెల్ టవర్‌ను ఏర్పాటు చేయనియొద్దని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బాలరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. టవర్ ఆరోగ్య సంబంధ సమస్యలు తలెత్తే ప్రమాదముందన్నారు. సంఘం ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా తీర్మానించినట్లు తెలిపారు. అదేవిధంగా కాలనీలో సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకుపోయినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, కోశాధికారి సుధీర్‌గౌడ్, కాలనీ వాసులు ఆలూరిచెన్నయ్య, అశోక్, హన్మంతు, వామన్‌కుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.